క్లుప్తంగా

నేడు పెంపుడు శునకాలకు వ్యాక్సిన్

చీరాల అర్బన్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శునకాలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్‌లు గురువారం వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.చిట్టిబాబు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక వైకుంఠపురంలోని పశువైద్యశాలలో వ్యాక్సిన్‌లు వేయనున్నట్లు చెప్పారు. జంతువుల నుంచి మనుషులకు రాబిస్, ఆంత్రాక్స్, క్షయ, బ్రూసెల్లోసిస్, ఎవియన్ ఇన్‌ఫ్లూయంజా తదితర వ్యాధులు సంక్రమిస్తాయని, ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ప్రజలు తమ పెంపుడు శునకాలను తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. వ్యాక్సిన్ డోసులు ఆధారంగా మరికొద్ది రోజుల కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

వాడిన పూలతో సాంబ్రాణి కడ్డీల తయారీ

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారికి రోజూ వాడే వివిధ రకాల పూలతో సాంబ్రాణి కడ్డీలను తయారు చేసే కేంద్రాన్ని ఈవో సుభద్ర బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో స్వామి వారికి వాడిన పూలతో సాంబ్రాణి కడ్డీలు తయారు చేసి విక్రయిస్తారని ఆమె వెల్లడించారు. దీనికి సంబంధించిన టెండర్‌ను కాకినాడ జిల్లా తుని మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పోలనాటి సూరన్న రూ.1.15,000 దక్కించుకున్నాడని చెప్పారు. స్వామి వారికి అదనపు ఆదాయం సమకూరనుంది.

వరకట్నం వేధింపులపై కేసు

మార్టూరు: భర్త అతని బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్న నేపథ్యంలో ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కమలాకర్ బుధవారం రాత్రి తెలిపారు. వివరాలు.. మార్టూరుకు చెందిన పఠాన్ జరీనాకు అదే గ్రామానికి చెందిన పఠాన్ నజీరుల్లాతో గతంలో వివాహం జరిగింది. ఆ సమయంలో జరీనాకు ఆమె పుట్టింటి వారు వరకట్నంగా 5 లక్షల రూపాయల నగదు ఇచ్చారు. వివాహం జరిగిన కొద్ది రోజుల తర్వాత జరీనాను భర్త, అతని తల్లిదండ్రులు, తోబుట్టువులు అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. ఇటీవల జరీనాపై దాడి చేసి ఇంటి నుంచి బయటకు గెంటేశారు. భర్త, అతని బంధువులపై జరినా బుధవారం రాత్రి ఫిర్యాదు చేసింది. జరీనా భర్త నజీరుల్లా అతని కుటుంబ సభ్యులు పఠాన్ జరీనా, సిరాజ్, సాధిక,మహబూబ్ జానీ బాషా, కమల్ జామ మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.25 వేల నిత్యావసరాల అందజేత

అద్దంకి: శింగరకొండలోని వృద్ధాశ్రమ నిర్వాహకుడు రావూరి రంగయ్యకు రూ.25 వేల విలువైన నిత్యావసరాలు, బధిరుల ఆశ్రమ పాఠశాలకు రూ.15 వేల విలువ చేసే సరుకులు, ఎల్ఐసీ సంఘం ఏఐఐఈఏ (ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్) వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మాధవకృష్ణ అధ్యక్షత వహించారు. యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ పారా శ్రీనివాసరావు, బ్రాంచ్ సెక్రటరీ సత్యనారాయణ, రవి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ తప్పక అమలు చేయాలి

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మెనూను ప్రతి రోజు కచ్చితంగా అమలు చెయ్యాలని ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన స్థానిక ఎమ్మార్సీలో సిబ్బంది, ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. రోజూ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మెనూ వడ్డించేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఎంఈఓ-2 మొలబంటి వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

నేడు బోడవాడకు ఆమంచి

పర్చూరు (చినగంజాం): మండలంలోని బోడవాడ పరిధిలో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొనున్నట్లు పార్టీ కార్యాలయం సమాచారం ఇచ్చింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం నుంచి పర్చూరు పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన అందుబాటులో ఉంటారని తెలిపారు.

నేడు 'జగనన్న సురక్ష'

యద్దనపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రం యద్దనపూడి సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ హాజరతున్నట్లు పార్టీ కార్యాలయం సమాచారం అందించింది. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి తిరునాళ్ల

చినగంజాం: రాజుబంగారుపాలెంలో పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం గురువారం నుంచి ప్రారంభం అవుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. తొలిరోజు అమ్మవారి పందిరి ఏర్పాటు, పసుపు కొట్టే కార్యక్రమం, రాత్రికి మ్యూజికల్ నైట్ ఉంటుందన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



జె.పంగులూరు: కౌలు రైతుకు కార్డు అందిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు



అద్దంకిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణచైతన్య

● ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య

జె.పంగులూరు: అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా చూడటమే జగనన్న సురక్ష లక్ష్యమని ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని బైటమంజులూరు, పంగులూరు-1 సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెట్టే ప్రతి కార్యక్రమం ప్రజాసంక్షేమ కార్యక్రమంలో భాగమేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు మన జగనన్న నాలుగేళ్లలో రూ.2.16 లక్షల కోట్లు నేరుగా ప్రజలకు అందాయన్నారు. ఈ వ్యవస్థను మొత్తం 2 లక్షల 65 వేల మంది వలంటీర్లు, లక్ష 50 వేల మంది సచివాలయ సిబ్బంది పనిచేసి ఎక్కడా అవకతవకలు లేకుండా నేరుగా లబ్ధిదారుని ఖాతాలోకి జమయ్యాయన్నారు. ప్రతి సచివాలయాల్లో ప్రజలకు 11 రకాల సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు కౌలు రైతు కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ ఐ.పద్మావతి, ఎంపీడీఓ రామాంజనేయులు, జెడ్పీటీసీ రాయిణి ప్రమీళ, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చిలుకూరి సాంబశివరావు, పంగులూరు సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, బైటమంజులూరు సర్పంచ్ రేణుక తిరుమలరాజు, ఎంపీటీసీ రాములమ్మ, మండల బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కర్‌రాజు, సొసైటి అధ్యక్షుడు రావూరి రంగారావు, కోఆప్షన్ సభ్యులు ఖాశీం పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. బుధవారం 3వ సచివాలయం పరిధి రామ్‌నగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ సాంకేతిక లోపాలతో సంక్షేమ పథకాలకు అర్హులు కాని వారు జగనన్న సురక్షలో సరైన సరిఫికెట్లు పొంది అర్హులు కావాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో తలపెట్టని కార్యక్రమాన్ని జగనన్న చేపట్టారన్నారు. ఎన్నికల ముందు ఇటువంటి కార్యక్రమాన్ని ప్రారంభించటం జగనన్నకు ప్రజల్లో ఆదరణకు నిదర్శనమన్నారు. అనంతరం అర్జీదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కుల ధ్రువీకరణకు 361, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు 297, ఆధార్ అనుసంధానానికి 23, కొత్త రేషన్‌కార్డు కోసం 3 అర్జీలు అందజేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఎల్.ఎస్తేరమ్మ, వైస్ ఛైర్మన్ పద్మేష్, అనంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

1280 సర్టిఫికెట్ల పంపిణీ

మార్టూరు: జగనన్న సురక్ష పథకంలో భాగంగా రెండు టీమ్‌లుగా ఏర్పడి రెండు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు 1280 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు, ఎంపీడీఓ కె.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో కోలలపూడి గ్రామ సచివాలయంలో 930 మందికి తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో కోనంకి గ్రామ సచివాలయం పరిధిలో 350 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, కోలలపూడి కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మి, కోలలపూడి, లక్కవరం, కోనంకి గ్రామాల సర్పంచ్‌లు కె.సతీష్‌కుమార్, అట్లూరి జెస్సీబాబు, జొన్నలగడ్డ రేణుకాదేవి, మాజీ డైరీ ఛైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి శివకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోలలపూడిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ సంధ్యశ్రీ

పర్చూరు (చినగంజాం): మండలంలోని వీరన్నపాలెం, నాగులపాలెం గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నాగులపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించగా మొత్తం 505 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. జేసీఎస్ కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు, వీరన్నపాలెం సచివాలయం పరిధిలో తహసీల్దార్ కె.సంధ్యశ్రీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు, మొత్తం 350 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

పనులు వేగంగా జరుగుతున్నాయి..



ఇంత వేగవంతంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగడం ఇప్పుడే చూస్తున్నా. ఫ్యామిలీ నంబర్ సర్టిఫికెట్ కావాలంటే కనీసం 15 రోజులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సి ఉంటుంది. ఇప్పుడు అర్జీ పెట్టుకున్న వెంటనే సర్టిఫికెట్ ఇచ్చారు. ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది.

పైసా ఖర్చులేదు:



నా పేరు దారా సాంబయ్య. మాది పంగులూరు. గతంలో కుల ధ్రువీకరణ పత్రం కోసం, ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం 150 నుంచి 200 వందల రూపాయల వరకు ఖర్చు అయ్యేది. సర్టిఫికెట్ చేతికి రావాలంటే వారం నుంచి 10 రోజులు సమయం పట్టేది. ప్రస్తుతం మన జగనన్న ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా వలంటీర్లు ఇట్టి వద్దకే సర్టిఫికెట్ అందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మేలు

● ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కృష్ణ చైతన్య

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలనే మార్చారని, ప్రజలకు మేలు జరుగుతోందని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని పాతమల్లాయపాలెం గ్రామం, ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, సచివాలయ, వలంటీర్ల పనితీరు తెలుసుకున్నారు. జగనన్న అధికారాన్ని చేపట్టగానే ఇచ్చిన హామీలన్నీ ప్రాధాన్యత క్రమంలో నెరవేర్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో పారదర్శకంగా పథకాలు అందిస్తున్నారని, పథకాలు అందని వారికి జగనన్న సురక్ష క్యాంపులో అవకాశం కల్పిస్తారన్నారు. నవరత్నాలు అమలుతో ప్రతి ఒక్కరికి ఆర్థిక భరోసా కల్పించిన జగనన్నను రెండో సారి ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ జూపల్లి రాఘవరావు, స్థానిక నేతలు బండి గంగా ప్రసాద్, ముద్దపాటి శంకర్, జూపల్లి లింగయ్య, సారెద్దు శివరామరాజు, వివిధ గ్రామాలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు వేగంగా కల్పించాలి



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

● ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

వేటపాలెం: చీరాల నియోజకవర్గం పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పన వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. దేశాయిపేట పంచాయతీ పరిధి వివేకానంద కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్‌లను పరిశీలించారు. ప్రతి కుళాయి సక్రమంగా వాటర్ వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మించిన సచివాలయం-4 వద్ద డ్రైనేజీని పరిశీలించారు. మాజీ సర్పంచ్‌లు లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, అందే కృష్ణ, పాల్గొన్నారు.

చీరాల్లో..

చీరాల మున్సిపాలిటీ పరిధిలోని నవాబ్‌పేట ఈద్గాను సందర్శించారు. అక్కడ జరుగుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఇనుప గేట్లను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. దర్గాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 21వ వార్డు ఇన్‌చార్జి కళ్యాణం విజయప్రకాష్, గుంటూరు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్‌లో పింఛన్ అందజేత

మేదరమెట్ల: కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామానికి చెందిన నూకతోటి కుమారి ఆరోగ్యం బాగుండక పోవడంతో ఆమె పెద్ద కుమారుడు నివాసం ఉంటున్న హనుమాన్ జంక్షన్‌లో ఉంటోంది. స్థానిక వలంటీర్ గొల్ల సుభాషిణి బుధవారం కుమారి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేసింది. పింఛన్ తీసుకున్న ఆమె ఎంతో ఆనందం వ్యక్తం చేసింది. రానున్న ఎన్నికల్లో కూడా జగన్ ముఖ్యమంత్రి అవ్వాలని కుమారి ఆకాంక్షించినట్లు వలంటీర్ తెలిపింది.



పింఛన్‌కు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్



పింఛన్ అందుకుంటున్న కుమారి

వైద్యశాలకు వెళ్లి పింఛన్ పంపిణీ

బల్లికురవ: అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తూరు మాజీ సర్పంచ్ హెచ్ లక్ష్మా నాయక్‌కు వలంటీర్ బాపట్ల ప్రసన్న బుధవారం వైద్యశాలకు వెళ్లి ఫించన్ పంపిణీ చేశారు. అనారోగ్యం బారిన పడటంతో వారం రోజులుగా నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో నాయక్ చికిత్స పొందుతున్నారు. 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పేట వైద్యశాలకు వెళ్లి పింఛన్ పంపిణీ చేయటంతో సర్పంచ్ అశ్వని, సెక్రటరీ వాణి ప్రత్యేకంగా అభినందించారు.

చినగంజాం ఎంఈఓగా అజయ్‌బాబు

చినగంజాం: మండల నూతన విద్యాశాఖాధికారి-1గా బి.అజయ్‌బాబు నియమితులయ్యారు. ఆయన మంగళవారం మండల రిసోర్స్ భవనంలో బాధ్యతలు చేపట్టారు, ఆయన గతంలో కొత్తపట్నం మండలం విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి ఇటీవల కౌన్సిలింగ్‌లో చినగంజాం మండలం కోరుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ గంగాధర్ అద్దంకి మండలానికి బదిలీ అయ్యారు. ఎంఈఓ-2గా ఎస్.కోటేశ్వరరావు గత నెల 20వ తేదీన బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే.



ఎంఈవోను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బల్లికురవ: బల్లికురవ ఎంఈవో-1గా వి.వస్త్రంనాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మార్టూరు ఎంఈవోగా పనిచేస్తూ ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహించేందుకు వచ్చిన నాయక్ విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, జీతాలు సకాలంలో చెల్లింపునకు కృషి చేస్తామని చెప్పారు. ఎంఈవో-2 కె.రమేష్‌బాబు, ఉపాధ్యాయ సంఘాల నేతలు డి.శేషగిరి, జి.వీరాంజనేయులు, ఎస్.ప్రభాకరరావు, ఎస్.శ్రీనివాసరావులు ఆయన్ను అభినందించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

చీరాల రూరల్: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ప్రేమ హార్ట్ హాస్పటల్ అధినేత డాక్టర్ విస్తర్ల బాబూరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని విజయలక్ష్మిపురం మండల ప్రజా పరిషత్ ఎలిమెంటరీ స్కూల్లో విద్యనభ్యసిస్తున్న 40 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు డాక్టర్ బాబూరావు చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చదుకునే రోజుల్లో స్కూళ్లలో ఇటువంటి సౌకర్యాలు లేవని, అయినా ఎంతో కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చామని చెప్పారు. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ స్కూళ్లలో మంచి ప్రతిభగల ఉపాధ్యాయులను ప్రభుత్వం ఏర్పాటు చేసి చదువు చెప్పిస్తోందని, అన్ని స్కూళ్లలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. దాతలు అందించిన సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం వెంకటేశ్వర్లు సూచించారు. శంకరరెడ్డి, స్కూలు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనుకు ఎక్సలెన్స్ అవార్డు

అద్దంకి రూరల్: అద్దంకికి చెందిన నూర్‌బాషా సంఘ యువజన ప్రచార కార్యదర్శి కోటికలపూడి శ్రీను బుధవారం ఎక్సలెన్స్ అవార్డు బుధవారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో టీఆర్‌వీస్ సంఘం వారు ఎక్సలెన్స్ అందజేశారు. నూర్‌బాషా సంఘ అధ్యక్షుడు నాయిమ్, ప్రధానకార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న కారు

మేదరమెట్ల: టైరు పంక్చర్ కావడంతో కారు అదుపు తప్పి సిమెంట్ దిమ్మెలను ఢీకొంది. ఈ సంఘటన బుధవారం వెంకటాపురం సమీపంలో జరిగింది. నెల్లూరు జిల్లా అన్నారెడ్డిపాలేనికి చెందిన ముగ్గురు విజయవాడకు కారులో బయల్దేరారు. వెంకటాపురం సమీపానికి రాగానే టైరు పంక్చరైంది. కారు డివైడర్ కోసం ఉంచిన సిమెంటు దిమ్మెలను బలంగా ఢీకొంది. కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలయ్యాయి. కారు దెబ్బతింది.

పోలీసులపై ఆరోపణలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీరాల డీఎస్పీ ప్రసాదరావు

అద్దంకి రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం పాటు పడే పోలీస్ శాఖను కించపరిచేలా ఆరోపణలు చెయ్యటం సరికాదని చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాదరావు అన్నారు. మండలంలోని చక్రాయపాలేనికి చెందిన మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై వివవరణ ఇస్తూ స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామంలోని ఆర్‌బీకేకు వెళ్లే దారిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన తిరుపతి వెంకాయమ్మ నోటీసులు తీసుకునేందుకు నిరాకరించటంతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించామని, ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆవేశంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వివరించారు. వెంకాయమ్మ, ఆమె కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ ఉమేష్ పాల్గొన్నారు

బహిరంగంగా మద్యం తాగడం నేరం

చీరాల: బహిరంగంగా మద్యం తాగడం నేరమని ఈపూరుపాలెం ఎస్ఐ పి.జనార్దన్ అన్నారు. బుధవారం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 26 మంది, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న చీరాల డీఎస్పీ

అద్దంకి రూరల్: అద్దంకి పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మడంతో పాటు దాన్ని తాగుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు చీరాల డీఎస్పీ ప్రసాదరావు తెలిపారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. అద్దంకి పట్టణంలో గంజాయి అమ్మడంతో పాటు దాన్ని ఉపయోగిస్తున్న అజయ్, ప్రసన్న, పృథ్వీరాజ్, నరసింహా, పుల్లయ్యలను పట్టుకుని వారి నుంచి నుంచి కేజీ 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గంజాయికి అలవాటు పడ్డవారి వివరాలు తెలియజేస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి డ్రి ఎడిక్షన్ సెంటర్‌కు పంపించి సహకరిస్తామని డీఎస్పీ తెలిపారు.

ఇంకొల్లుకు బస్సు సర్వీసులు పెంచాలంటూ వినతి

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లుకు బస్సు సర్వీసులు పెంచాలంటూ ఆర్టీసీ డైరెక్టర్ ఆపరేషన్ అధికారి కోటేశ్వరరావును ఇంకొల్లు మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు మోహన కృష్ణ శాస్త్రి విజయవాడ ప్రధాన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఇంకొల్లు మండల కేంద్రం ఇంకొల్లుకు సరైన బస్సులు నడపటం లేదని, దూర ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించాలని, హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం ప్రాంతాలకు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా బస్సులు నడపాలని కోరారు. అదే విధంగా నైట్ హాల్ట్ బస్సులు, పల్లెవెలుగు బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో ముందుగా ఇంకొల్లు నుంచి గుంటూరుకు బస్సులు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వాస్తవాలు మాట్లాడితే సహించలేరా?

చీరాల: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల అమలుపై నిత్యం విషం కక్కుతున్న ప్రతిపక్ష నాయకులు, పార్టీలు చేస్తున్న విష ప్రచారంపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత వాస్తవాలు మాట్లాడితే సహించలేరా అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి దాసరి రూప సుమ ప్రశ్నించారు. బుధవారం చీరాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై మోకాలడ్డు పెడుతూ అసత్య ప్రచారాలను ప్రతిపక్ష పార్టీలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతోందని, ప్రతిపక్షనేత చంద్రబాబు, పచ్చమీడియా చేస్తున్న దుష్ప్రచారాలపై ఎమ్మెల్సీగా పోతుల సునీత మాట్లాడితే ఉలిక్కి పడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీతపై టీడీపీ మహిళా నాయకులు మాట్లాడడం సరి కాదన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారి ఇంటి ముంగిటకు తీసుకొచ్చారన్నారు. సమస్య పరిష్కారానికి కార్యాలయాలు చుట్టూ తిరగనవసరం లేకుండా వార్డులోనే పరిష్కరించుకునే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. సమావేశంలో దేవరపల్లి రత్నకుమారి, సుభాషిణి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కమిటీలో చీరాల వాసులకు పదవులు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ఇటీవల ద్వారాకా తిరుమలలో జరిగింది. రాష్ట్ర కమిటీలో చీరాలకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. కమిటీలో జిల్లా నుంచి చుక్కపల్లి రామకోటయ్యను ముఖ్య సలహాదారునిగా, గాదె హరిహరరావును అసోసియేట్ ప్రెసిడెంట్‌గా, సింహాద్రి యల్లమందారెడ్డిని వైస్ ప్రెసిడెంట్‌గా, అంగలకుదిటి నాగవీరభద్రాచారిని సెక్రటరీగా, అత్తులూరి రామారావును ఈసీ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీలో పదవులు చేపట్టిన వారిని రిటైర్డు ఉద్యోగుల సంఘం చీరాల అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి అభినందనలు తెలిపారు.